క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలి



ముడసర్లోవ వద్ద వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ గురువారం ఉదయం ముడసర్లోవ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను వాకర్స్ క్లబ్ వద్ద కలిశారు. సభ్యులను పలకరించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని ఆయన కోరారు. తూర్పు నియోజకవర్గంలో హనుమంతవాక, శివాజీ పార్కు, అప్పూఘర్, బీచ్ రోడ్లలో వాకర్స్ వ్యాయామం చేసుకోవడానికి వీలుగా జిమ్ పరికరాలు అమర్చినట్లు తెలిపారు. అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని వాకర్స్‌కు హామీ ఇచ్చారు.

టీటీడీ పంచాంగం విక్రయాలు ప్రారంభం

ఎంవీపీ కాలనీ: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర సిద్ధాంత ప్రచాంగాలు విక్రయం గురువారం ప్రారంభమైంది. ఈ మేరకు టీటీడీ మేనేజర్ హేమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో పంచాగాన్ని రూ.75కి విక్రయిస్తున్నట్లు తెలిపారు. శ్రీ క్రోధి నామ సంవత్సర సిద్ధాంత పంచాగంలో దైనందిన జీవితానికి సంబంధించిన అన్ని రకాల సమాచారాలతో పాటు ఆధ్యాత్మిక విశేషాలు పొందుపరిచినట్టు ఆమె పేర్కొన్నారు. పంచాంగం కావాల్సిన వారు ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎంవీపీ కాలనీ: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని ఎంవీపీ సెక్టార్–1, కొత్త వెంకోజిపాలెం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–1లోని 11 కేవీ ఫీడర్ నిర్వహణ సర్వీసుల్లో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

డాక్టర్ శ్రీకృష్ణకు యోగా చికిత్స ఆచార్య పురస్కారం



డాక్టర్ శ్రీ కృష్ణను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విభాగం గౌరవ ఆచార్యుడు డాక్టర్ చందన శ్రీకృష్ణకు యోగా చికిత్స ఆచార్య పురస్కారం లభించింది. ఇండియన్ యోగా అసోసియేషన్ డాక్టర్ శ్రీకృష్ణ సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించింది. ఈ సందర్భంగా కృష్ణను వీసీ ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి వలంటీర్ల రాజీనామా

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు పరిధి రాజీవనగర్, పిఠాపురం కాలనీ సచివాలయాల్లో వలంటీర్లుగా పని చేస్తున్న వంకర యశ్వంత్, సుగ్గు శ్రీను రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం రాజీవ్‌నగర్ సచివాలయం అడ్మిన్‌కు యశ్వంత్, పిఠాపురం కాలనీ సచివాలయం అడ్మిన్‌కు శ్రీను తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడిచిన ఐదేళ్లుగా చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లామని, ఇప్పుడు ఆ సేవ చేయవద్దు అంటూ కూటమి చేస్తున్న కుట్రలను తరిమికొట్టాలని రాజీనామా చేస్తున్నట్టు వారు స్పష్టం చేశారు.

మాకెందుకీ అవస్థ?

- కొనసాగుతున్న పింఛన్ ఇక్కట్లు
- కారణమైన చంద్రబాబుపై మండిపడుతున్న లబ్ధిదారులు



సచివాలయంలో పింఛన్లు తీసుకుంటున్న వృద్ధులు

ఆరిలోవ: టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన నిర్వాకానికి రెండో రోజు గురువారం కూడా పింఛన్ కష్టాలు కొనసాగాయి. అవ్వాతాతలు, దివ్యాంగులు, కిడ్నీ బాధితులు పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ నెల పింఛన్ల పంపిణీ సచివాలయాల వద్ద బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన విషయం తెలిసిందే. నిజానికి ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించేవారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన ఫిర్యాదుతో వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. దీంతో సచివాలయాల వద్ద ఆయా సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టారు. సుమారు ఐదేళ్ల పాటు ఒకటో తేదీన ఇంటి వద్ద పింఛన్ తీసుకొనే వృద్ధులు.. ఇప్పుడు నానా అవస్థలు పడుతూ సచివాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అతి కష్టమ్మీద పింఛన్ తీసుకొని ఇంటి ముఖం పట్టారు. గురువారం ఎక్కువ మంది వృద్ధులు పింఛన్లు అందుకున్నారు. నడవలేని కొందరు ఆటోల్లో సచివాలయానికి చేరుకుని పింఛన్లు తీసుకున్నారు. ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, పైనాపిల్ కాలనీ, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, బాలాజీనగర్, తోటగరువు, రవీంద్రనగర్, ఆదర్శనగర్, విశాలాక్షినగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక ప్రాంతాలలో పింఛన్ల పంపిణీ రెండో రోజు కొనసాగింది.

బెడ్ రెస్ట్ పేషెంట్లకు ఇంటికి వెళ్లి అందజేత

పూర్తిగా నడవలేక, వైద్యుల సలహా మేరకు బెడ్ రెస్ట్‌లో ఉన్నవారు, డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు, పక్షవాతం బాధితులకు సచివాలయం సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు. ప్రతి నెలా ఈ పని వలంటీర్లు చేసేవారు. ఇప్పుడు కొత్తగా సచివాలయం సిబ్బంది ఇంటికి వెళ్లి బెడ్‌రెస్ట్‌లో ఉన్నవారికి పింఛను ఇస్తుండడంతో కొన్ని చోట్ల ఇబ్బందులు పడ్డారు.



ఆరిలోవలో పక్షవాతం రోగికి రూ.5 వేలు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రామకృష్ణ

మరో రెండు నెలలు కష్టాలు తప్పవు

ఏయూ క్యాంపస్: మరో రెండు నెలలు పాటు మాకు ఈ పింఛన్ కష్టాలు తప్పేటట్టు లేదని చిన వాల్తేరుకు చెందిన లబ్ధిదారుడు ముదిలి అప్పలస్వామి వాపోయాడు. ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటికి వచ్చి చేతిలో పెన్షన్ డబ్బులు పెట్టే వలంటీర్లను విధుల నుంచి తప్పించడం చాలా దారుణమన్నారు. వారు మాలాంటి వారికి ఎంతో సేవ చేశారని చెప్పారు. వారిపై తప్పుడు ఫిర్యాదులు చేసి పెన్షన్ పంపిణీ చేయకుండా నిలిపేశారని ఆగ్రహం వ్యక్తం చేవారు. ఈ వయసులో కాళ్లీడ్చుకుంటూ సచివాలయానికి రావాల్సి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాలాంటి వారికి ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తే తప్పేలా అవుతుందని ప్రశ్నించారు. నడవలేని, అనారోగ్యంతో ఉన్న తమకు పెన్షన్ కోసం ఇలా ఎండలో రప్పించడం ఎంత వరకు సమంజసమని నిలదీశాడు. చిన వాల్తేరు సచివాలయం వద్ద గురువారం ఉదయం కార్పొరేటర్ ముvvల లక్ష్మి ఎదుట అప్పలస్వామి తన గోడు చెప్పుకున్నాడు.



కాళ్లు నొప్పిగా ఉన్నా, పెన్షన్ కోసం సచివాలయానికి వచ్చానని కార్పొరేటర్ లక్ష్మి ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్న ముదిలి అప్పలస్వామి

దివ్యాంగులను ఇబ్బంది పెట్టడం దారుణం



ఐదేళ్లుగా ప్రభుత్వం నుంచి దివ్యాంగ పెన్షన్ అందుకుంటున్నాను. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క నెల కూడా పెన్షన్ కోసం ఇబ్బంది పడిన దాఖలాలు లేవు. . ప్రభుత్వం నియమించిన వలంటీర్లు ఇంటి వద్దకే పెన్షన్ తెచ్చి అందించేవారు. అది కూడా ప్రతి నెల 1వ తేదీన తాను ఇంకా నిద్రలేవక ముందే వలంటీర్లు పెన్షన్ సొమ్ముతో వచ్చి తలుపులు తట్టేవారు. ప్రస్తుతం పెన్షన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమలాంటి వికలాంగుల పరిస్థితి మరింత గోరంగా ఉంది. వలంటీర్లను పెన్షన్ పంపిణీ నుంచి తప్పించడం కచ్చితంగా ప్రభుత్వంపై కక్షసాధింపు చర్యే. జగనన్న ప్రభుత్వానికి పేరొస్తుందనే అక్కసుతోనే వలంటీర్లను విధుల నుంచి తప్పించారని భావిస్తున్నాను.

– వానుపల్లి హరిబాబు, లబ్ధిదారు, ఆదర్శనగర్, 17వ వార్డు

నిస్వార్థమైన వలంటీర్ల సేవలను రాజకీయం చేశారు..



ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లకు రాజకీయం రంగు పూశారు. వారి సేవలను నిలిపివేశారు. దీంతో పెన్షన్ సొమ్ము కోసం సచివాలయానికి వెళ్లడానికి పడరాని పాట్లు పడుతున్నాం. ఇలా చేయడం పద్ధతిగా లేదు. తమకు మళ్లీ పాత రోజుల గతి పట్టించిన టీడీపీ అధినేత చంద్రబాబుకు తగిన సమయంలో బుద్ధి చెబుతాం

– మొహమ్మద్ సలీం, దివ్యాంగ పింఛన్‌దారు,

పెన్షన్ కోసం నానా అవస్థలు పడ్డాం..



పెన్షన్ డబ్బుల కోసం సచివాలయానికి వెళ్లడానికి నానా అవస్థలు పడ్డాం. ఒకరి సహాయం లేకుండా ఒంటరిగా నడవలేని పరిస్థితి. అదే వలంటీర్లు ఉండి ఉంటే వారే ఒకటో తేదీన ఇంటికి వచ్చి ఇచ్చేవారు. వారి సేవలను దూరం చేశారు. వలంటీర్లను తొలగించడం అన్యాయం. వారు సేవలు మాలాంటి వారికి ఎంతో అవసరం.

– సతి విజయ, వికలాంగ పెన్షన్ లబ్ధిదారు, మద్దిలపాలెం

ఆదర్శనగర్‌లో ఇంటింటి ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సత్యవతి, తదితరులు

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 17వ వార్డు ఆదర్శనగర్‌లో ఇంటింటి ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ స్థానిక మండల ప్రధాన కార్యదర్శి పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఈ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఆవశ్యకతపై వారు ఇంటింటికి వెళ్లి వివరించారు. తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

7న జూలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ఆరిలోవ: నేషనల్ జూ లవర్స్ డేని ఈ నెల 8న జూలో నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 7న మూడు నుంచి 12 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. జూలో ఉన్న జంతువులు థీమ్ ప్రకారం చిన్నారులు డ్రెస్‌లు వేసుకొని పోటీలో పాల్గొనాలన్నారు. చిన్నారుల వేషం జంతువులకు సంబంధించిన సమాచారం ఇచ్చేదిగా ఉండాలన్నారు. ఈ నెల 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న చిన్నారులు మరిన్ని వివరాల కోసం 94411 30894 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే ప్రజా సంక్షేమం సాధ్యం



7వ వార్డు ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం గురువారం 17వ వార్డులో జోరుగా కొనసాగింది. ఇందులో భాగంగా ఎంపీ ఎంవీవీ 81వ రోజు 17వ వార్డు సెక్టార్–5లో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌కు ఓటేసి తనను తూర్పు ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొంత కాలంగా నియోజకవర్గంలోని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ విజయంతో ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. తన ప్రచారానికి తూర్పు నియోజకవర్గ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఈ సారి తూర్పులో వైఎస్సార్‌సీపీ జెండా తప్పకుండా ఎగురుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు సుబ్రహ్మణ్యం, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియపై అవగాహన అవసరం



వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న జేసీ కె.మయూర్‌అశోక్

మహారాణిపేట: నామినేషన్ల ప్రక్రియ, బ్యాలెట్ వినియోగంపై అధికారులు, సిబ్బందికి అవగాహన అవసరమని విశాఖ తూర్పు నియోజకవర్గ ఆర్వో, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పేర్కొన్నారు. గురువారం తన చాంబర్‌లో తూర్పు నియోజకవర్గ అధికారులతో జేసీ సమావేశమయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం నాటి నుంచి ముగిసే వరకు సంబంధిత క్రతువుకు సంబంధించి అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనుమతులు జారీ ప్రక్రియ, శిక్షణ సదస్సులు, పరిశీలన ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల నిర్వహణ ప్రక్రియను సజావుగా జరిపించాలని సూచించారు. సంబంధిత సామగ్రి, సాంకేతిక పరికరాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో నాయకత్వ లక్షణాలు



సదస్సులో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: సేవకుడే నాయకుడని, అటువంటి నాయకులను తయారు చేయడమే జాతీయ సేవా పథకం లక్ష్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ పాలసీ(శ్రీ పెరంబదూర్), ఏయూ జాతీయ సేవా పథకం సంయుక్తంగా విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులకు ‘యువజన హక్కులు న్యాయ సహాయం’ అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సమాచార మాధ్యమాలలో విస్తృత ప్రచారాన్ని ఇవ్వాలన్నారు. గౌరవ అతిథిగా డీఎస్‌ఎన్‌ఎల్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ యువత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ హక్కులు–విధులకు విడదీయరాని సంబంధం కలిగి ఉందన్నారు. హక్కుల కోసం పోరాడే వారు విధులను నిర్వహించాలని సూచించారు. అనంతరం యువజన విధానం డ్రాఫ్ట్ 2023 అంశంపై ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్, సమాచార హక్కు చట్టం–యువత పాత్రపై డాక్టర్ కె.పల్లవి, ప్రాథమిక హక్కులు–ఆదేశ సూత్రాలు–ప్రాథమిక విధులపై వై.సత్యనారాయణ కీలకోపన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జిల్లాలోని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు 40 మంది పాల్గొన్నారు.

‘కాపులకు సముచిత స్థానం కల్పించాలి’

ఎంవీపీ కాలనీ: సార్వత్రిక ఎన్నికల్లో కాపులకు సముచిత స్థానం కల్పించాలని కోరుతూ పలువురు జిల్లా కాపు నాయకులు గురువారం బీజేపీ నగర అధ్యక్షుడు మేడపాటి రవీంద్రకు వినతి పత్రం అందజేశారు. లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో కాపు నాయకులు మోహన్‌రావు, సత్యనారాయణ, మహేష్, లలిత, శంకరరావు తదితరులు సామాజిక ప్రాధాన్యత ఆధారంగా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా పార్టీ అధిష్టానానికి సూచనలు చేయాలని రవీంద్రను కోరారు.

కుక్కర్ల పంపిణీపై కేసు

ఎంవీపీ కాలనీ: మద్దిలపాలెం తారా మసీదు ప్రాంతంలో కుక్కర్ల పంపిణీపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. కొందరు వ్యక్తులు స్థానికులకు కుక్కర్లు పంపిణీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో గురువారం రాత్రి పోలీసులు ఘటన స్థలంలో తనిఖీ చేశారు. 46 కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. ఈ కుక్కర్లను ఎవరు పంపిణీ చేస్తున్నారు, ఎందుకు పంపిణీ చేస్తున్నారు అనే అంశంపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు.

15 నుంచి ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ప్రాక్టికల్స్

మద్దిలపాలెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2021–22 విద్యా సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలతో పాటు, నాలుగో సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నామని అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ జి.రాజుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టైమ్ టెబుల్‌ను పోస్టల్ చిరునామాలకు పంపించామని పేర్కొన్నారు. విధిగా విద్యార్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

జీవో 114 ప్రకారం వేతనాలు చెల్లించాలి



ట్రెజరీస్ డైరెక్టర్ మోహన్‌రావును సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

మద్దిలపాలెం : ఏపీపీటీడీ ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం అలవెన్స్‌లతో కలిపి వేతనాలు చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణరెడ్డి, వై.శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ మోహనరావును విజయవాడలోని ఆయన చాంబర్‌లో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. సుమారు 44 డిపోల పరిధిలో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 114ను అమలు చేయాలని కోరారు.

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం : వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం – కిరండూల్ (08551/08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

- వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు – కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం – కిరండూల్ (08551), కిరండూల్ – విశాఖపట్నం (085520 పాసింజర్ రైళ్లు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



వరాహగిరి మురళీధర్

మద్రిపాలెం : కంచరపాలెం 5వ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓల్డ్ ఐటీఐ జంక్షన్ దరి హ్యాపీహోమ్స్ అపార్ట్‌మెంట్‌లో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న వరాహగిరి మురళీధర్ (19) సెకండ్ ఇయర్ బీటెక్ చదువుతున్నాడు. బుధవారం రాత్రి ఫోన్ సిగ్నల్ రావడం లేదు.. టెర్రస్ పైకి వెళ్తున్నా అని చెప్పి వెళ్లాడు. తర్వాత ఫ్లాట్స్‌లో ఉన్న వారు ఎవరో కింద పడిపోయారు అని చెప్పడంతో తల్లిదండ్రులు వెళ్లి చూడగా వారి కుమారుడు మురళీధర్ అని తెలిసి కొన ఊపిరితో ఉన్న అతన్ని అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు తెలిపారు. తాను అనుకున్నది చేయలేకపోతున్నానని మనస్థాపం చెంది, సోదరుడిని బాగా చదివించమని వాట్సాప్ స్టేటస్ పెట్టాడని మృతుని స్నేహితులు తల్లిదండ్రులకు తెలిపారు. యువకుడి తండ్రి దుర్గా మహేష్ గిరి ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి సీఐ ఎస్. భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు.

పింఛన్ల పంపిణీ అడ్డుకున్నది చంద్రబాబే



చినగదిలిలో సిద్ధం సభలో ఫ్యాన్ గుర్తు చూపిస్తూ మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- 12వ వార్డు సిద్ధం సభలో ఎంపీ ఎంవీవీ ధ్వజం
- సార్వత్రిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపు



సిద్ధం సభలో పాల్గొన్న ప్రజలు

ఆరిలోవ: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయకుండా అడ్డుకున్నది టీడీపీ అధినేత చంద్రబాబేనని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ధ్వజమెత్తారు. జీవీఎంసీ 12వ వార్డు చినగదిలిలో కార్పొరేటర్ అక్కరమాని రోహిణితో కలిసి గురువారం ‘మేము సిద్ధం, మా బూత్ సిద్ధం’ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను ఇబ్బంది పాలు చేస్తున్న టీడీపీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బాటలు వేసే ఇంగ్లిష్ మీడియం అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. తూర్పు నియోజకవర్గానికి ఎమ్మెల్యే వెలగపూడి చేసిందేమీ లేదన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన 600 హామీలను నెరవేర్చకపోవడం వల్లే ప్రజలు ఆయనను ఇంటికి పంపించారన్నారు. ఈసారి జరగనున్న ఎన్నికల్లో కూడా మళ్లీ బాబుకు ప్రజలు అదే గతి పట్టిస్తారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను ఎంవీవీ కోరారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.వి.నారాయణ, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, అటవీ శాఖ వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో వర్సిటీకి పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఇటీవల జరిగిన 37వ నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో ఏయూ చిత్రకళా విభాగం విద్యార్థులు రెండు విభాగాలలో పతకాలు సాధించారు. పంజాబ్ రాష్ట్రం లూధియానాలో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన యువజనోత్సవాలలో ఏయూ విద్యార్థులు తమ ప్రతిభను చూపారు. చిత్రకళా విభాగ విద్యార్థి కె.నాగ మణికంఠ క్లే మోడలింగ్(మృణ్మయ శిల్పాలు) తయారీ విభాగంలో మూడో స్థానాన్ని, అదే విభాగానికి చెందిన విద్యార్థులు జె.రంగబాబు, యు.ఎం.ఎస్ నవ్య, బి.ఝాన్సీ, కె.రేణుక ఇనస్టాలేషన్ పోటీలో ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. జాతీయ స్థాయిలో ఏయూ ప్రతిభ ను ఇనుమడింపచేసే విధంగా విద్యార్థులు రాణించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయ్ మోహన్, విభాగ విద్యార్థులు పాల్గొన్నారు.